తెరిపివ్వని వర్షం.. తీవ్ర నష్టం


చింతపల్లిలో కూలిన వృక్షం తొలగింపు చర్యలు


తాజంగి బలబద్రం వద్ద వంతెనను పరిశీలిస్తున్న ఎంపీపీ అనూషాదేవి


గూడెం కాలనీలో భారీ వర్షానికి కూలిన షెడ్డు


వీఆర్ పురం మండలం చింతరేగుబల్లిలోని వీధిలో ముంచెత్తిన వరదనీరు


గూడెంకొత్తవీధి విద్యుత్తు లైన్లపై పడిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

పెదబయలు: తుపాను ప్రభావంతో గడిచిన కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షంతో జిల్లాలోని ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉధృతంగా గెడ్డలు, వాగులు ప్రవహిస్తుండడంతో చాలా గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పంట పొలాలన్నీ నీట మునిగాయి. గ్రామాలకు రాకపోకలు నిలిచిపోవడంతో నిత్యావసరాల కోసం గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. వర్షాలకు భారీ వృక్షాలు రోడ్డుపై పడడంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పలేదు. గంటలకొద్దీ గిరిజనం వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నిచోట్ల విద్యుత్ వైర్లు తెగిపడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఎడతెరిపివ్వని వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో ఇళ్లు నేలమట్టమయ్యాయి. బాధితులు రోడ్డున పడ్డారు. చాలా చోట్ల రహదారులు కోతకు గురయ్యాయి.

పెదబయలు మండలంలోని మండలంలోని ఇంజరి. గిన్నెలకోట. జామిగుడ, పర్రెడ. పంచాయతీల్లో ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నట్టు సమాచారం అందినట్టు తహసీల్దార్ రామ్మోనరావు, డీటీ రంగారావు తెలిపారు. వాగులు, గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయని, అప్రమత్తంగా ఉండాలన్నారు.

జి.మాడుగుల: మండలంలో గల రెండు రోజుల నుండి ఎడతెరపిలేకుండా కురుస్తున్న వర్షానికి పలు గ్రామాల్లో ఇళ్లు నేలకూలాగా, పైపు కల్వర్టులు వరదకు కొట్టుకుపోయాయి.మండలంలో సాడేక్ గ్రామంలో కోట లక్ష్మయ్య, సెగ్గె బాబూరావులకు చెందిన రెండు ఇళ్లు కూలిపోయాయి. ఆదే గ్రామంలో బొంజంగి పోయే మార్గంలో పైపు కల్వర్టు కూలిపోయింది.రాకపోకలకు ఇబ్బందులు ఏర్పాడ్డాయి. సర్పంచ్ కిముడు రాంబాబు ఆయా ప్రాంతాల్లో జరిగిన తుపాను నష్టాన్ని పరిశీలించారు. సాడేక్ వద్ద చెట్టు కూలిపోయింది. వాహన రాకపోకలు ఇబ్బంది ఏర్పడింది. పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లి గ్రామానికి చెందిన కిముడు సన్యాసిరావుకు చెందిన పెంకుటిల్లు గోడ కూలిపోయింది. వర్షాలకు ఇళ్లు దెబ్బతిన్న బాధితులకు ప్రభుత్వ నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వారు కోరారు.

చింతపల్లిరూరల్: విస్తారంగా కురుస్తున్న వర్షాలకు, గాలులకు మండలంలో లంబసింగి ఘాటీలో సోమవారం భారీ వృక్షం నేలకూలింది.దీంతో చింతపల్లి, నర్సీపట్నం వేళ్లి వచ్చే వాహానాల రాకపోకలకు సుమారు గంట సేపు అంతరాయం ఏర్పడింది.ఈ మేరకు ఎస్ఐ అరుణ్ కిరణ్ ఆధ్వర్యంలో పోలీసులు, అధికారులు వృక్షాన్ని తొలగించారు. వర్షాలకు ముంపు బారిన పడిన ప్రాంతాలను ఎంపీపీ అనూషదేవి, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు దురియా పుష్పలత వేరువేరుగా సోమవారం సందర్శించారు. మండలంలోని తాజంగిలో రిజర్వాయర్ నీటి ప్రవాహం పెరగడంతో బలబద్రం వంతెనపై స్థాయి వరకు నీరు చెరుకుంది. ఎంపీపీ, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు మాట్లాడుతూ వర్షాల కారణంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకున్న ప్రభుత్వం అన్ని విధాలుగా రైతులకు ఆదుకోని నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఎస్ఎంఐ జేయి లోకేష్, కో–ఆప్షన్ సభ్యులు నాజర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: భారీ వర్షాలతో ఎక్కడికక్కడ చెట్లు, కొమ్మలు, ప్రధాన రహదారులపై, విద్యుత్తు తీగలపై పడుతున్నాయి. ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి మండలంలోని 33 కేవీ విద్యుత్తు లైన్లపై భారీ వృక్షాలు పడిపోయాయి. దీంతో సరఫరా నిలిచిపోయింది. సిబ్బందికి సమాచారం రావడంతో మరుసటి రోజు సోమవారం ఉదయాన్నే సంఘటన ప్రాంతానికి చేరుకున్న సిబ్బంది లైన్లపై పడ్డ చెట్లను తొలగించి సరఫరాను పునరుద్ధరించారు.

నేలకూలిన మెకానిక్ షెడ్డు

భారీ వర్షం కారణంగా ఆదివారం అర్ధరాత్రి గూడెం కొత్తవీధికి సమీపంలోని కాలనీలో మెకానిక్ షెడ్డు పూర్తిగా నేలమట్టమైంది. గూడెం కాలనీకి చెందిన మునియాండీ తన ఇంటి ముందు వేసిన రేకుల షెడ్డు ఉన్నపళంగా నేలకూలింది. ఆ సమయంలో షెడ్డు కింద పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనాలు ధ్వంసమయ్యాయి. అర్ధరాత్రి కావడంతో అక్కడ జనసంచారం లేకపోవడం వల్ల పెద్ద ప్రమాదం తప్పింది.


చిన్నగెడ్డను పరిశీలిస్తున్న మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షురాలు పుష్పలత

కొయ్యూరు: వర్షాలు తగ్గకపోవడంతో అనేక కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి.ఎం.భీమవరంలో బొడ్డుమామిడి లంక, యూ.చీడిపాలెంలో గొట్టుపాడు, పలకజీడి కాలువలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో సుమారు 25 గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి.


వీఆర్ పురం మండలం చింతరేగుబల్లిలో పడవల ద్వారా గ్రామస్తులను తరలిస్తున్న చినమట్టపల్లి సర్పంచ్ పిట్టా రామారావు

క్లుప్తంగా

నిత్యావసర సరకుల పంపిణీ


సరకులు అందజేస్తున్న మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కృష్ణకుమారి

అరకులోయ రూరల్: మండలంలో మాడగ పంచాయతీ ఎం.హట్టాగుడ గ్రామంలో మానవ హక్కుల నేర నిరోధక సంఘం రాష్ట్ర (ఏజెన్సీ ప్రాంతం) అధ్యక్షురాలు కృష్ణకుమారి ఆధ్వర్యంలో సోమవారం పేద కుటుంబాలకు నిత్యావసర సరకులతో పాటు టాయిలెట్, డిటెర్జంట్ సబ్బులు, నూన్‌ప్యాకెట్లు తదితర సరకులను ఇంటింటా తిరిగి అందజేశారు. ఆమెకు గ్రామ మహిళలు, పెద్దలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామపెద్ద సింహాచలం తదితరులున్నారు.

నేటి నుంచి ఆధార్ డ్రైవ్

కొయ్యూరు/చింతపల్లి రూరల్: కొయ్యూరు, చింతపల్లి మండలాల్లో ఈనెల 22 నుంచి 27వ తేదీ వరకు ఆధార్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్టు కొయ్యూరు, చింతపల్లి ఎంపీడీవోలు లాలం సీతయ్య, వీరసాయిబాబు సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఆధార్ కార్డులోని వివరాల్లో మార్పు, చేర్పులు, ఆధార్ నమోదు తదితర సేవలందించనున్నట్టు పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ఘనంగా దాశరథి కృష్ణమాచార్యులు జయంతి


వేడుకలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

వై.రామవరం: మండలంలోని పి.యర్రగొండ గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో సోమవారం ప్రిన్సిపాల్ శ్రీపాద రామకృష్ణ అధ్యక్షతన దాశరథి కృష్ణమాచార్యులు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దాశరది చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ జిల్లా గౌరవ అధ్యక్షుడు రమణ, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

వెటర్నరీ అధికారుల సంఘం వైస్ చైర్మన్‌గా పరిశిక ఎంపిక


పరిశిక అప్పన్నబాబు

గంగవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కేంద్రమైన కాకినాడలో సోమవారం జరిగిన ఏపీ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ ఆఫీసర్ల అసోసియేషన్ వైస్ చైర్మన్‌గా గంగవరం మండలం నెల్లిపూడి గ్రామీణ పశువైద్యశాల జూనియర్ వెటర్నరీ అధికారి పరిశిక అప్పన్నబాబు రెండవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైస్ చైర్మన్ పదవికి ఎంపిక చేసిన సంఘం చైర్మన్, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ చిట్టిబ్బాయి

పాడేరు రూరల్(హుకుంపేట): ఉన్న విద్య కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై ప్రిన్సిపాల్ డాక్టర్ వనము చిట్టిబ్బాయి సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. వాహనచోదకులు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. వాహనం నడిపినపుడు హెల్మెట్ ధరించాలని, పరిమితికి మించిన వేగంతో ప్రయాణించొద్దని సూచించారు. పీవో డాక్టర్ వి.రమేష్‌బాబు, సిబ్బంది గౌరిశంకర్, దామోదర్, గణేష్, భాస్కర్, శంకర్‌రావు, గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

అధ్వానంగా అంగన్‌వాడీ కేంద్రం


వనుగుమ్మ అంగన్‌వాడీ కేంద్రంలో చేరిన వర్షపునీరు

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రం వర్షానికి కారిపోతుంది. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం వరపు నీరు పూర్తిగా చేరి పోవడంతో అంగన్‌వాడీ కేంద్రం నిర్వహణ చేసేందుకు సిబ్బంది నానా పాట్లు పడ్డారు. కేంద్రంలోని సామగ్రి, సరకులను భద్రపరిచేందుకు శ్రమించాల్సి వచ్చింది. వర్షాలు కురిసినపుడు బిక్కుబిక్కుమంటూ సిబ్బంది పనులు చేస్తున్నారని గ్రామస్తులు తెలిపారు.కారిపోతున్న అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కె.శంకర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో పలు చోట్ల అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి ప్రమాదంగా ఉన్నాయని, ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరారు.

అప్రమత్తంగా ఉండాలి


నూరుపూడి కొండ కాలువను పరిశీలిస్తున్న సీఐ రుద్రరాజు భీమరాజు


వై.రామవరం ఎస్ఐ సంతోష్ కుమార్


గంగవరం ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి

మారేడుమిల్లి: మండలంలోని వాగులు, కాలువల వద్ద ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మారేడుమిల్లి సీఐ రుద్రరాజు భీమరాజు సూచించారు. తుపాను కారణంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వరద నీరు చేరి వాగులు, పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రమాదాలు జరిగే అస్కారం ఉండడంతో రెవిన్యూ, పోలీస్ అధికారులు మండలంలో ప్రమాదాల గల వాగులు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, భద్రత చర్యలు చేపట్టారు. మండలంలోని సున్నంపాడు గ్రామ సమీపంలో ఉత్పత్తంగా ప్రవహిస్తున్న నూరుపూడి కొండ కాలువను సీఐ రుద్రరాజు భీమరాజు సోమవారం తన సిబ్బందితో కలిసి పరిశీలించారు. కాలువలు పొంగేటప్పుడు ఎట్టి పరిస్థితుల్లో ఎవరూ దాటేందుకు ప్రయత్నించొద్దని సూచించారు. సమస్యలు ఏమైనా ఉంటే అధికారులు దృష్టికి తీసుకురావలని కోరారు..

వై.రామవరం: తుపాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలకు మండల ప్రజలంతా అప్రమతంగా ఉండాలని ఎస్ఐ ఎం.సంతోష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటన ద్వారా హెచ్చరించారు. కురుస్తున్న భారీ వర్షాలకు పొంగి పొర్లుతున్న కొండవాగుల్లో ఎవరూ దిగవద్దని సూచించారు. గాలివానకు చెట్లు పడి ప్రమాదం పొంచి ఉన్నందున చెట్ల కిందికి వెళ్లవద్దని సూచించారు.

గంగవరం: వర్షాల వల్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి తెలిపారు. వర్షాల వల్ల ప్రబలే డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి వ్యాధుల సోకకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎవరికైనా అనారోగ్యం సమస్యలు వస్తే వెంటనే దగ్గరిలోని వైద్యులను సంప్రదించాలన్నారు.కొండవాగులు దాటే సమయంలో జాగ్రత్తగా ఉండాలన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు అందించాలి

చింతూరు: తుపాను వల్ల ఏకధాటి వర్షాలతో రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు పడుతున్న వరద బాధితులకు వెంటనే నిత్యావసర సరకులు అందజేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. చింతూరు మండలం కుమ్మూరులో వరద ప్రాంతాలను సీపీఎం నాయకులు సోమవారం పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేవలం కొన్ని కుటుంబాలకు టార్పాలిన్లు, బియ్యం మాత్రమే ఇచ్చి అధికారులు చేతులు దులుపుకున్నారని, నిత్యావసరాలు లేక బాధితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి వెంటనే బాధితులకు నిత్యావసరాలతో పాట కూరగాయలు, దోమతెరలు, కిరోసిన్ అందించాలని వారు కోరారు. నాయకులు బొప్పెన కిరణ్, లోతా రామారావు, సీసం సురేష్, లక్ష్మణ్, సుబ్బారావు పాల్గొన్నారు.

అక్రమ తవ్వకాలు చేపడితే చర్యలు


తవ్వకాలను పరిశీలిస్తున్న మండల పరిషత్ ఏవో ఉదయ్‌భాస్కర్, సిబ్బంది

అరకులోయ రూరల్: మండల పరిషత్ కార్యాలయానికి ఆనుకుని ఉన్న ఓ రెస్టారెంట్ నిర్వాహకులు అక్రమంగా సెప్టిక్ ట్యాంక్ తవ్వేందుకు తీసిన మట్టి, డెబ్రిస్‌ను కార్యాలయం ప్రాంగణంలో వేశారు. ఈ విషయంపై సమాచారం అందుకున్న ఏవో ఉదయ్‌భాస్కర్, ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో వెళ్లి పనులను నిలుపుదల చేశారు. రెస్టారెంట్‌లో అక్రమ తవ్వకాలు చేసినా, వ్యర్థాలు, వృథా నీటిని బయటకు వదిలినా చర్యలు తీసుకుంటామని సంబంధిత హోటల్ నిర్వాహకులను హెచ్చరించారు. వైస్ ఎంపీపీ రామన్న, ఎంపిటీసీ సభ్యులు భీమరాజు, దురియా ఆనంత్‌కుమార్, కృష్ణ, బాలు, రాజ్‌కుమార్, సిబ్బంది ఉన్నారు.

జీడిమామిడి మొక్కల పంపిణీ


రైతులకు జీడిమామిడి మొక్కలు పంపిణీ చేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మారేడుమిల్లి: స్థానిక కొత్తకాలనీ రైతులకు ఎంపీడీవో వీరా కిషోర్ , ఎంపీపీ సార్ల లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యుడు గొర్లె బాలాజీ బాబు, సర్పంచ్ కొండా జాకబ్ సోమవారం జీడిమామిడి మొక్కలను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ప్రస్తుతం తుపాను కారణంగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వీలైనంతవరకు ఇంటి నుంచి బయటకు రావద్దన్నారు. వరద నీరు చేరి ఎక్కడిక్కడ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయని, ఎవరూ దాటే సాహసం చేయవద్దని కోరారు. ఏపీడీ శ్రీనివాసురావు, ఏపీవో రెడ్డి బాబు, పలువురు టెక్నికల్, ఫీల్డ్ అసిసెంట్లు, రైతులు పాల్గొన్నారు.

బంకులో కల్తీ డీజిల్ అమ్మకాలపై ఫిర్యాదు

- సెల్లూం బంకులో పెట్రోల్,డీజల్‌లో వర్షపు నీరు కలిసిన వైనం
- మొరాయిస్తున్న వాహనాలు.. ఆందోళనలో వాహనచోదకులు
- బంకుపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు


తహసీల్దార్ రఫిజాన్‌కు ఫిర్యాదు చేస్తున్న జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ప్రసన్నకుమార్

ముంచంగిపుట్టు: మండలంలోని ఏనుగురాయి పంచాయతీ సెల్లూం గ్రామ సమీపంలో ఉన్న బంకులో పెట్రోల్, డీజల్ వేసుకుంటే ఎక్కడ బండి అగిపోతుందో తెలియని పరిస్థితి నెలకొందని వాహనచోదకులు చెబుతున్నారు. సెల్లూం బంకులో జి.చిన్నాబాబు తన జెసిబి వాహనంలో రూ.5వేల రూపాయలతో డీజిల్ వేసుకుంటే జెసిబి స్టార్ట్ అవ్వలేదని, వాహనం నుంచి డీజల్ బయటకు తీసి చూస్తే డీజల్‌లో నీళ్లు కలిసి ఉన్నట్టు గుర్తించి, బంకు యజమాని రామకృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆయన చెప్పారు. ఈ విషయాన్ని జేసీబీ యజమాని చిన్నబ్బాయి జిల్లా విజిలెన్స్ కమిటీ సభ్యుడు ప్రసన్నకుమార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన బంకును పరిశీలించారు. డీజల్‌లో నీరు కలవడం నిజమేనని గుర్తించి, తహసీల్దార్ రఫిజాన్‌కు ఫిర్యాదు చేశారు. గతంలోనే కల్తీ పెట్రోల్, డీజల్ అమ్ముతున్నట్టు పలు ఫిర్యాదులు వచ్చినా బంకుపై ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం వల్లనే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు, వాహనచోదకులు చెబుతున్నారు.ఈ విషయంపై తహసీల్దార్ రఫీజాన్ మాట్లాడుతూ సెల్లూం బంకులో కల్తీ పెట్రోల్, డీజల్ అమ్మకాలపై విజిలెన్స్ శాఖ అధికారులకు తెలియజేసి వారితో బంకును తనిఖీ చేసి తదుపరి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

పొంచి ఉన్న ప్రమాదం


కోత గురైన వంతెన

అనంతగిరి: మండలంలోని అరకు–విశాఖ ప్రధాన రహదారి కొండగూడ–కరకవలస గ్రామాల మధ్యలో గల ప్రధాన వంతెన శిథిలావస్థకు చేరుకుంది. వంతెనకు ఆనుకుని నిర్మించిన రక్షణగోడ సైతం కూలిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని, వాహనచోదకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అరకు–విశాఖ రహదారిలో వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయని, వంతెన కూలిపోతే రాకపోకలు అంతరాయం ఏర్పడుతుందని, వర్షాల వల్ల గెడ్డ ఉధృతంగా ప్రవహిస్తుందని, దీంతో వంతెనకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన చెందుతున్నారు. సమస్యలపై ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు, వాహనచోదకులు కోరుతున్నారు.

వేతన బకాయిలు చెల్లించాలి


ఉపాధి కూలి జమకాలేదని చెబుతున్న దారకొండలో ఉపాధి కూలీలు

గూడెం కొత్తవీధి: ఆరు వారాలుగా తాము చేసిన ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి కూలి డబ్బులు తమ ఖాతాల్లో నేటికీ జమకాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అమ్మవారి దారకొండ పంచాయతీకి చెందినపలువురు గిరిజనులు సోమవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. అమ్మవారి దారకొండ పంచాయతీలో ఉపాధి పథకం కింద ఆరువారాలుగా వివిధ రకాల పనులు చేసినా సంబంధించి కూలీని తమ బ్యాంకు ఖాతాల్లో నేటికీ జమకాలేదన్నారు. అధికారులను అడిగితే రెండు మూడు రోజుల్లో జమ అవుతాయని చెపుతున్నారన్నారు. ఈ ఏడాది రాజ్‌మా తదితర పంటలు దెబ్బతినడంతో జీవనోపాధి కోసం ఉపాధి పనులపైనే ఆధారపడి తమ పిల్లలను కుటుంబాలను పోషించుకుంటున్నామని, పిల్లల స్కూల్ యూనిఫారాలు కుట్టుకూలీ ఇచ్చేందుకు డబ్బులు లేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చొరవతీసుకుని వేతన బకాయిలు చెల్లించాలని కోరుతున్నారు.

డీడీవోలను నియమించాలి

పెదబయలు: మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో గ్రేడ్–4 పంచాయతీ కార్యదర్శులు ఐదుగురు మాత్రమే డీడీఓలు బాధ్యతలు నిర్వహిస్తున్నారని, అన్ని పంచాయతీలకు డీడీఓలను నియమించాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీలకు ఐదుగురు మాత్రమే డీడీవోలు ఉండడం వల్ల ఒకోక్కరికి నాలుగు నుంచి ఐదు గ్రామ పంచాయతీలకు బాద్యతలు చేయాల్సి వస్తుందని ఎక్కడ కూడ పూర్తిగా విధులు నిర్వహించే అవకాశం లేకుండపోయిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ఉన్న డీడీవోలు మండల కేంద్రంలో ఉండడం వల్ల గ్రామస్తులు జనన, మరణ ఇతరత్రా ధ్రువపత్రాల కోసం మండల కేంద్రానికే రావాల్సి వస్తుందని చెప్పారు. ప్రస్తుతం గ్రేడ్–4 కార్యదర్శులకు మాత్రమే డీడీవో అధికారాలున్నాయని, అయితే మండలంలో తక్కువ మంది ఉండడం వల్ల వారు విధులు ఆటంకం ఏర్పడుతుందని దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారని పలువురు చెబుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం, ఉన్నతాధికారులు స్పందించి గిరిజన ప్రాంతంలో గ్రామ సచివాలయాల్లో ఉన్న గ్రేడ్–5 కార్యదర్శులను డీడీవోలుగా భాద్యతలు అప్పగిస్తే ప్రజలకు అందుబాటులో సేవలందించాలని కోరారు. మన్యంలో మండల కేంద్రానికి శివారు గ్రామాలకు 50 కిలోమీటర్లు పైబడి దూరం నుంచి రావడం ఇబ్బందిగా ఉందన్నారు. ప్రజలకు అందుబాటులో సేవలందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్పంచ్‌లు లకే అశోక్‌కుమార్, లోయిదాస్, మత్స్యరాజు, రవిశంకర్, లక్ష్మీపతి, వరలక్ష్మీ, కాసులమ్మ, శోభరాణి, అన్నమ్మ తదితరులు కోరుతున్నారు.

రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలి

వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహారావు


నరసింహారావు

డుంబ్రిగుడ(అరకులోయ టౌన్): ఆంధ్ర ప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి నరసింహారావు తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వమైన టీడీపీ, జనసేన, బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తోందన్నారు. ఎక్కడ పడితే అక్కడ రౌడియిజం సాగిస్తు దాడులకు పాల్పడుతు భయభ్రాంతులు సృష్టిస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 45 రోజుల వ్యవధిలోనే 30 హత్యలు, 300కి పైగా దాడుల సంఘటనలో రాష్ట్రంలో జరగడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ప్రలోభాలు చేసి అధికారం దకించుకున్న కూటమి ప్రభుత్వం కుట్రపూరితమైన రాజకీయలకు తెరలేపుతుందన్నారు. దాడులు, కక్షసాధింపు చర్యలు విరమించుకోకపోతే భవిష్యత్‌ల ప్రజాగ్రహం తప్పదని పేర్కొన్నారు.